
సాక్షి
అనంతపురం
మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/21.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పృథ్వీరాజ్‌కు ‘మై భారత్’ పురస్కారం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న పృథ్వీరాజ్

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లికి చెందిన ముమ్ముల్ల పృథ్వీరాజ్ మై భారత్ రాష్ట్రీయ సేవా యోజన పురస్కారం అందుకున్నాడు. న్యూఢిల్లీలో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రశంసాపత్రం స్వీకరించాడు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా పృథ్వీరాజ్ అందించిన ఉత్తమ సేవలను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారు. పృథ్వీరాజ్ నెల్లూరు సింహపురి యూనివర్సిటీలో పీజీ (బయోటెక్నాలజీ) పూర్తి చేశాడు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా డిజిటల్ ఇండియా, బాలికా శిక్షా, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాడు. రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం అందుకున్న పృథ్వీరాజ్‌కు గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

గజవాహనంపై చింతల రాయుడి విహారం



తాడిపత్రి రూరల్: పట్టణంలోని శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి దేవాలయంలో సోమవారం స్వామి వారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు స్వామి వారికి అర్చకులు మురళిస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. గజవాహనంపై స్వామివారిని అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

నేడు రథోత్సవం

చింతలవెంకటరమణస్వామి కల్యాణ, రథోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు కల్యాణోత్సవం అనంతరం విందు ఉంటుంది. ఆ తర్వాత భూదేవి, శ్రీదేవి సమేత చింతలరాయుని ఉత్సవ విగ్రహాలను గాంధీకట్ట వద్ద ఉన్న రథం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 2.45 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు.

‘ఉపాధి’లో మేసేశారు!

- రూ.13.40 కోట్ల పనుల్లో రూ.1.87 కోట్ల అక్రమాలు

శెట్టూరు: ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. మండలంలో 2024 ఏప్రిల్ 31 నుంచి 2025 మార్చి 1 వరకూ వరకు జరిగిన రూ.13.40 కోట్ల పనుల్లో రూ.1.87 కోట్ల అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి పీడీ సలీం బాష, ఏపీడీ సుధాకర్ రెడ్డి, డీవీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఒక్క కనుకూరు పంచాయతీలోనే రూ.93 లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు తేల్చి, రూ.72 వేలు జరిమానా విధించారు. లక్ష్మంపల్లి, చిన్నంపల్లి, ములకలేడులోనూ పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం తేల్చింది. అక్రమాలకు పాల్పడిన ఉపాధి టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు మొత్తం రూ.2,56,500 జరిమానా విధించారు.

కనికట్టు చేశారు..

మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి పనుల్లో కనికట్టు చేసినట్లు వెల్లడైంది. రైతులకు క్షేత్ర స్థాయిలో మొక్కలు లేకపోయినా ఉన్నట్లు చూపి, బ్లాక్ ప్లాంటేషన్‌లో మొక్కలు పదుల సంఖ్యలో ఉంటే వందలాది మొక్కలు ఉన్నట్లు నమోదు చేసి బిల్లులు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో అధికార టీడీపీ నాయకులకు అదనపు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. మండలంలోని చిన్నంపల్లిలో ఆశా, ములకలేడులో అంగన్‌వాడీ కార్యకర్తలకు భర్తలు ఉన్నా వితంతు పింఛన్ తీసుకుంటున్నట్లు తనిఖీలో బయటపడింది. ఆయా గ్రామాల్లో వితంతు, డప్పు, చర్మకళాకారుల పెన్షన్లను పలువురు అక్రమంగా పొందుతున్నట్లు సిబ్బంది గుర్తించారు.

పైసలిస్తేనే ఎనీవేర్

- కనగానపల్లి మండలం తూముచెర్ల రెవెన్యూ పొలంలో 60 ఎకరాలకు పైగా భూమిని విక్రయించేందుకు యజమానులు సన్నద్ధమయ్యారు. భూమి కొనుగోలుదారులు అనంతపురం నగరానికి చెందిన వారు కావడంతో ‘ఎనీవేర్ రిజిస్ట్రేషన్’ కింద నగరంలోని రామ్‌నగర్ కార్యాలయంలోనే 60 ఎకరాల భూమికి మార్కెట్ విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించి సెప్టెంబర్ 15న రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. తూముచెర్ల భూములు చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వస్తుండడంతో ఆమోదం కోసం చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ‘కార్డు సాఫ్ట్‌వేర్’ ద్వారా పంపారు. అయితే, ‘అసైన్డ్’ భూములంటూ అక్కడి సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. వాస్తవంగా తూముచెర్ల సర్వే నంబర్ 99లోనివి పట్టా భూములు కావడం గమనార్హం. ఈ క్రమంలో భూముల రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించే ఆస్కారమే లేదు. తనను ‘ప్రసన్నం’ చేసుకోలేదనే ఏకైక కారణంతో చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు తిరస్కరించినట్లు తెలుస్తోంది.
- కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఓ వ్యక్తి స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే అక్కడి సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామి రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ‘ఎనీవేర్’ కింద అనంతపురం నుంచి రిజిస్ట్రేషన్ పెట్టుకోండి ఆమోదం తెలుపుతానని హామీ ఇచ్చారు. సదరు స్థిరాస్తి యజమాని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలుపగా.. రామ్‌నగర్‌లో ఉన్నానని, అక్కడికి వచ్చి డబ్బు ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు గత నెలలో డబ్బు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ‘ఎనీవేర్’ను కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఎలా ‘క్యాష్’ చేసుకుంటున్నారో ఈ రెండు ఘటనల ద్వారా సులువుగా అర్థం చేసుకోవచ్చు.



- ప్రభుత్వ లక్ష్యానికి కొందరు సబ్ రిజిస్ట్రార్ల తూట్లు
- ప్రసన్నం చేసుకుంటే ఓకే అంటున్న వైనం
- లేదంటే కొర్రీలు పెడుతూ తిరస్కరణ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ సేవలను వినియోగదారులకు చేరువ చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ ఎక్కడి నుంచైనా చేసుకునేందుకు వీలుగా ‘ఎనీవేర్ రిజిస్ట్రేషన్’ విధానాన్ని తీసుకొచ్చారు.

సమర్పించుకుంటేనే..

ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. సర్కారు లక్ష్యానికి కొందరు సబ్ రిజిస్ట్రార్లు తూట్లు పొడుస్తున్నారు. వివిధ రకాల కారణాలు చూపుతూ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో సబ్ రిజిస్ట్రార్లను ప్రసన్నం చేసుకొని ముడుపులు సమర్పించుకుంటే ‘ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల’కు ఇట్టే ఆమోదం తెలుపుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లేకుంటే ఏదో ఒక కొర్రీతో తిరస్కరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ నష్టమట!

ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్లు చేస్తే స్థానిక కార్యాలయాలకు రెవెన్యూ నష్టమొస్తుందంటూ సబ్ రిజిస్ట్రార్లు దాట వేస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో ఎక్కడి నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకున్నా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకే ఆదాయం వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రత్యేకంగా రెవెన్యూ నష్టం ఎలా వస్తుందో అర్థం కాని పరిస్థితి. కేవలం తమకు అక్రమ ఆదాయం తగ్గుతుందనే కారణంతో ‘ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల’ను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా 10 నిమిషాల్లో ముగిసేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండు గంటల్లో డాక్యుమెంట్లు సైతం వినియోగదారులకు అందించే వెసులుబాటు కల్పించింది. అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డాక్యుమెంట్లు పొందేందుకు వారాలు పడుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సబ్ రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు చేయాల్సిందే..



రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం చేసేందుకు ప్రవేశ పెట్టిన ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని సబ్ రిజిస్ట్రార్లు అమలు చేయాల్సిందే. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే తిరస్కరించాలి. పట్టా భూములను తిరస్కరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

జ్యుడీషియల్ స్టాంప్‌లు కావలెను!



అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జ్యుడీషియల్ స్టాంప్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని వారాలుగా స్టాంపులు లభించక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రూ. 50, రూ. 100 స్టాంపులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని స్టాంపుల విక్రయ కేంద్రంలో ‘నో స్టాక్’ బోర్డు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ఏ ఒక్క కార్యాలయంలోనూ స్టాంపులు దొరకడం లేదు. దీంతో స్టాంప్ వెండార్లు, కామన్ సర్వీస్ కేంద్రాలను వినియోగదారులు ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రతి స్టాంపుపై రూ.20–30 వరకూ అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ భార్గవను వివరణ కోరగా జ్యుడీషియల్ స్టాంపుల కొరత ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, రెండు మూడు రోజుల్లో అన్ని రకాల స్టాంపులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

అవార్డు అందుకున్న కలెక్టర్



అనంతపురం అర్బన్: స్వచ్ఛ జిల్లా అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సోమవారం విజయవాడలో కలెక్టర్ ఓ.ఆనంద్ అందుకున్నారు.

చట్టం లేదు.. అంతా తూచ్!

- టీచర్ల సిఫార్సు బదిలీలకు గేట్లు తెరిచిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీచర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలో గగ్గోలు పెట్టిన లోకేష్
- అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే నేరుగా బదిలీలకు శ్రీకారం
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మండిపాటు

“ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత, నిష్పాక్షికత ఉండేలా ముసాయిదా చట్టాన్ని తయారు చేశాం. బదిలీల్లో అవినీతి, రాజకీయ జోక్యాన్ని అరికడతాం. ఎలాంటి వివాదాలకు తావులేకుండా, ఉపాధ్యాయుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏటా వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు జరిగేలా చట్టం రూపొందించాం..” కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలివీ. అయితే, సరిగ్గా ఏడాదిన్నర కాలానికే సిఫార్సు బదిలీలకు కూటమి ప్రభుత్వం గేట్లు ఎత్తడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

అనంతపురం ఎడ్యుకేషన్: మూడు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలో టీచర్లను ప్రభుత్వమే నేరుగా బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు టీచర్లు బదిలీలు అయ్యారు. కణేకల్లు మండలం మాల్యాం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఏ తెలుగు టీచరుగా పని చేస్తున్న దేవన గోపమ్మను బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం జెడ్పీ హెచ్‌ఎస్‌కు, మడకశిర మండలంలో ఎస్జీటీగా పనిచేస్తున్న రాధను నల్లచెరువు మండలం గజేఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. ఈ బదిలీల వెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారడంతో పాటు రాజకీయ పలుకుబడి ఉపయోగించారనే విమర్శలు విద్యాశాఖలో గుప్పుమంటున్నాయి. ఇది ఆరంభమేనని,



రానున్న రోజుల్లో మరింతమంది బదిలీల ఉత్తర్వులు రానున్నాయని కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

వారు చేస్తే తప్పు... వీరు చేస్తే రైటా?

గత ప్రభుత్వంలో కొందరు టీచర్లు వారి వ్యక్తిగత అవసరాల నేపథ్యంలో ఇలానే నేరుగా బదిలీలు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 మంది దాకా బదిలీ అయ్యారు. వారందరూ తీరా స్కూళ్లల్లో చేరే సమయంలో ప్రభుత్వం మారింది. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ ఆ బదిలీలకు ససేమిరా ఒప్పుకోకుండా అడ్డుపుల్ల వేశారు. వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితులు కోర్టును ఆశ్రయించినా లాభం లేకపోయింది. అదే విద్యాశాఖ మంత్రి తాజాగా ప్రభుత్వ బదిలీలను ఎలా అంగీకరిస్తున్నారంటూ సామాన్య టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసింది తప్పయితే ఈ ప్రభుత్వం చేసింది రైటా? అని ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక ముసాయిదా చట్టం తీసుకొచ్చిన వారే చట్టాన్ని తుంగలో తొక్కారని మండిపడుతున్నారు. ప్రభుత్వ బదిలీలపై కొందరు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు.

పోలీసుస్టేషన్ ‘పచ్చ’గా..



టీడీపీ కండువాలు కప్పుకున్న వారితో సీఐ రాజు

- తీవ్ర వివాదాస్పదమైన కూడేరు సీఐ తీరు

కూడేరు: కూడేరు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను సీఐ రాజు టీడీపీ కార్యాలయంగా మార్చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుస్టేషన్‌ను ఆయన ‘పచ్చ’గా మార్చిన తీరు తీవ్ర వివాదాస్పదమవుతోంది. వివరాలు.. కూడేరు మండలం ముద్దలాపురంలో వారం క్రితం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన పూజారి వెంకటేష్, పూజారి ధనుంజయ, పూజారి రమేష్ కుటుంబాలతో టీడీపీ కార్యకర్త జాఫర్ వలీకి ఇంటి ముందు దారి విషయమై గొడవ జరిగింది. దీనిపై జాఫర్ వలి కూడేరు పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాడు. ఈ క్రమంలోనే పోలీసులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురిచేశారు. టీడీపీ కండువా వేసుకుంటే సమస్యలుండవని సీఐ రాజు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఆ మూడు కుటుంబాలకు చెందిన వారికి అనంతపురంలో టీడీపీ నేత పయ్యావుల శీనప్ప సమక్షంలో ‘పచ్చ’ కండువాలు వేయించారు. అనంతరం అక్కడి నుంచి వారిని ముద్దలాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు నేరుగా కూడేరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారితో సీఐని సన్మానింపజేయడమే కాకుండా స్టేషన్‌లోనే కేక్ కట్ చేసి సంబరాలు చేయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మొన్నటి వరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కస్సు బుస్సుమన్న సీఐ రాజు కండువా మారగానే సంతోషంగా వారితో ఫొటోలు దిగడం వివాదాస్పమైంది. హుందాగా వ్యవహరిస్తూ ప్రజలకు మేలు చేయాల్సిన స్థానంలో ఉన్న అధికారి.. ఒక పార్టీకి కొమ్ము కాస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయడమేమిటంటూ సామాన్యులు మండిపడుతున్నారు.

గౌరమ్మ పండుగ.. భక్తిభావం నిండుగా

రాప్తాడు: తెలంగాణలో బతుకమ్మ పండుగను ఎంత ఘనంగా జరుపుకుంటారో.. జిల్లాలో అదే రీతిలో గౌరమ్మ ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటారు. అందులో భాగంగా రాప్తాడు మండలంలోని పాలచెర్ల, భోగినేపల్లి, ఎం. బండమీదపల్లి, బుక్కచెర్ల, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, పుల్లలరేవు, హంపాపురం, గాండ్లపర్తి తదితర గ్రామాల్లో గౌరమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్తులు.. సోమవారం నిమజ్జనోత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. ఈ సందర్భంగా యువతులు, చిన్నారులు, మహిళలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టారు. జ్యోతులను తలపై ఎత్తుకొని ఆలయాలకు వెళ్లి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ‘అమ్మమ్మ గౌరమ్మా... మాయమ్మ గౌరమ్మ మా ఇంటి మహాలక్ష్మి నీవమ్మా’ అంటూ ఊరేగింపు నిర్వహించి గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు.



పాలచెర్ల గ్రామంలో గౌరమ్మ నిమజ్జనం సందర్భంగా కోలాహలం

విచారణ పూర్తి.. చర్యలే తరువాయి

- శిశువు మృతిపై మహిళా, శిశు సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ విచారణ
- శిశుగృహ, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీ సిబ్బంది నుంచి వివరాల సేకరణ
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై మండిపాటు

అనంతపురం సెంట్రల్: శిశుగృహలో చిన్నారి మృతికి కారకులైన వారిపై చర్యలు తప్పవా? అంటే నివేదికలు రావడమే తరువాయి అనే సంకేతాలు వెలువడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం స్థానిక బుడ్డప్పనగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిశుగృహ, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సభ్యులను వేర్వేరుగా విచారించారు. విచారణ సమయంలో మీడియాను అనుమతించలేదు. శిశువు మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపై డైరెక్టర్ తీవ్ర స్థాయిలో మండిపడినట్లు తెలిసింది. శిశుగృహలో గొడవలకు దిగుతున్న వారిపైన, పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) మంజునాథ్‌పైనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు



శిశువు మృతిపై విచారణ చేస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

సమాచారం. ఐసీడీఎస్ పీడీ నాగమణి, జిల్లా మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్ శ్రీదేవి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఫిర్యాదుల వెల్లువ..

శిశుగృహ మేనేజర్, సోషల్‌వర్కర్, ఆయా మధ్య గొడవల కారణంగానే శిశువు మృత్యువాత పడినట్లు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో బాలుడి దత్తత కోసం వచ్చిన ఓ మహిళ నుంచి డబ్బు డిమాండ్ చేసిన ఉదంతాన్ని మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్యంగా శిశుగృహకు వచ్చిన బాలుడి ప్రాణాలు తీశారని తెలిపారు. దీనిపై డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి స్పందిస్తూ నవజాత శిశువు మరణాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. శిశుగృహలో పనిచేసే సిబ్బందిపై వస్తున్న ఆరోపణలన్నింటిపైనా త్వరలోనే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

సుమోటో కేసు నమోదు

అనంతపురం/అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహలో నవజాత శిశువు మృతిపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి ఎస్. రాజశేఖర్ స్పందించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆదేశాలతో సుమోటోగా కేసు నమోదు చేసి సోమవారం శిశుగృహను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల సంరక్షణ, పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

వారిలో గుబులు..

మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విచారణ నేపథ్యంలో శిశుగృహ మేనేజర్, ఆయాలతో పాటు, జిల్లా మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారిలో గుబులు రేగినట్లు తెలుస్తోంది. గండం నుంచి బయట పడేందుకు కొంతమంది రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారని సమాచారం. శిశుగృహకు నవజాత శిశువు అనారోగ్యంతో వచ్చాడని, విరేచనాలతో చనిపోయాడని డాక్టర్ నివేదికలు తెప్పిస్తే సరిపోతుందనే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, కలెక్టర్ ఆనంద్ తొలిరోజే అధికారులు తూతూమంత్రంగా ఇచ్చిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో విచారణ నిక్కచ్చిగా జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య



రవికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: స్థానిక తాటిచెర్ల మార్గంలోని నేషనల్ హైవే బ్రిడ్జి కింద సోమవారం గూడ్స్ రైలు కింద పడి మల్లెల రవికుమార్(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా భావించినా ఆ తరువాత మృతుడు అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురానికి చెందిన రవికుమార్‌గా గుర్తించినట్లు వివరించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థికపర సమస్యలతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి యత్నం గర్హనీయం

అనంతపురం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై ఓ మతోన్మాది దాడికి పాల్పడడం గర్హనీయమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు అన్నారు. దాడిని ఖండిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, గౌని నాగన్న, నాగరాజు బాబు, రాజశేఖర్ యాదవ్, నారపురెడ్డి తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం భారత రాజ్యాంగంపై దాడికి యత్నించడమేనన్నారు. దుండగుడు తక్షణమే న్యాయవ్యవస్థకు క్షమాపణ చెప్పాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కించపరిచే ప్రయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి బలవన్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుత్తి: స్థానిక జీఆర్‌పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్ఐ మహేంద్ర, కానిస్టేబుల్ నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మ హత్య చేసుకున్న ప్రాంతంలో ఉన్న టీవీఎస్ బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఫ్యాక్షన్ గతిని మార్చిన కరివేపాకు

కరివేపాకు వల్ల ఉపయోగం ఏముందని ప్రశ్నిస్తే.. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని, జీర్ణక్రియ దోహదపడుతుందని, మధుమేహాన్ని నియంత్రిస్తుందని, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందని ఠక్కున సమాధానమిస్తారు. అయితే తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి వాసులు మాత్రం కరివేపాకును చూసి ఫ్యాక్షన్ పారిపోయిందని అంటున్నారు. వ్యక్తుల మధ్య అనుబంధాలను పెంచిందని, ప్రశాంత జీవనానికి దోహదపడిందని అంటున్నారు. ఇంతకూ కరివేపాకు దెబ్బకు ఫ్యాక్షన్ ఎలా తోకముడిచిందో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే యర్రగుంటపల్లిని సందర్శించి తీరాల్సిందే.



యర్రగుంటపల్లి వద్ద సాగులో ఉన్న కరివేపాకు పంట

- కరివేపాకు సాగుతో ఫ్యాక్షనిస్టుల జీవితాల్లో వెలుగు
- పిల్లలకు ఉన్నత చదువులు

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లి చుట్టూ పచ్చని పంట పొలాలతో ఆకట్టుకుంటోంది. 3,066 మంది జనాభా ఉన్న ఈ గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఎక్కువగా ఎర్ర నేలలు ఉన్నాయి. కరివేపాకు పంటతోపాటు మొక్కజొన్న, కంది, అరటి, నిమ్మ, దానిమ్మ తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ గ్రామం ఒక్కప్పుడు ఫ్యాక్షన్ పడగ నీడలో ఎన్నో ఆటుపోట్లకు గురైంది.

ఆధిపత్య పోరుతో రాజుకున్న ఫ్యాక్షన్

మూడు దశాబ్దాల క్రితం యర్రగుంటపల్లిలోని కాటన్ మిల్లులో కార్మికుల మధ్య చోటు చేసుకున్న విభేదాలు గ్రామంలో చీలికలకు కారణమయ్యాయి. రెండు వర్గాలుగా గ్రామస్తులు విడిపోయారు. ఇదే అదనుగా ఓ వర్గానికి టీడీపీ ఆజ్యం పోస్తూ వచ్చింది. అడ్డుకునేందుకు మరో వర్గానికి కాంగ్రెస్ మద్దతు పలికింది. ఈ రెండు పార్టీలకు చెందిన ప్రధాన నేతలు తమ స్వార్థం కోసం గ్రామాన్ని రెండుగా చీల్చారు. చివరకు గ్రామంలో ఫ్యాక్షన్‌కు బీజం పడింది. హత్యలు, గృహ.. గడ్డివాముల దహనాలు, ఆస్తుల విధ్వంసం, బాంబుల మోతతో గ్రామం అట్టుడికిపోయింది. వేటకొడవండ్ల స్వైర విహారానికి నెత్తురు ఏరులై పారింది. పచ్చని పంట పొలాలు బీళ్లుగా మారాయి. రిమాండ్ పేరుతో జైళ్లల్లో కుమిలిపోయారు. కేసు వాయిదాలకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసుకుని తిరిగారు. దాడులు, ప్రతిదాడుల నుంచి ఎలా రక్షించుకోవాలలో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. పిల్లల చదువులు అటకెక్కాయి.

కరివేపాకు సాగుతో మార్పు

ఫ్యాక్షన్ ప్రభావంతో అట్టుడికిపోతున్న సమయంలో యర్రగుంటపల్లిలోని భూములను గుంటూరుకు చెందిన కొందరు రైతులు గుత్తకు తీసుకుని కరివేపాకు సాగు చేపట్టారు. అప్పటి వరకూ వర్గ కక్షలతో నలుగుతూ పంటల సాగుపై సరైన దృష్టి సారించలేక ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న స్థానికుల చూపు కరివేపాకు సాగుపై పడింది. గుంటూరు ప్రాంత రైతులు లాభాలు గడిస్తుండడంతో ఒక్కసారిగా గ్రామ రైతులందరూ కరివేపాకు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వర్గ కక్షలకు స్వస్తి పలికి కరివేపాకు సాగుపై దృష్టి సారించారు. దీంతో చూస్తుండగానే ఫ్యాక్షన్ మటుమాయమైంది. అప్పటి వరకూ కత్తులు దూసుకున్న వారు బంధుత్వ వరుసలు కలుపుకుని ఆప్యాయంగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. ఒకరి తర్వాత ఒకరు చొప్పున పంటల సాగుపై మనసు పెట్టడంతో 800 ఎకరాల్లో కరివేపాకు సాగు అందుబాటులోకి వచ్చింది. తొలుత యర్రగుంటపల్లికి మాత్రమే పరిమితమైన కరివేపాకు పంట ఆ తర్వాత ఇతర మండలాలకు విస్తరించింది. ప్రస్తుతం పెద్దపప్పూరు మండలంలో 780 ఎకరాలు, యాడికి మండలంలో 100 ఎకరాలు, పుట్లూరు మండలంలో 50 ఎకరాల్లో కరివేపాకు సాగులో ఉంది. యర్రగుంటపల్లికి చెందిన కొందరు రైతులు గుంతకల్లు మండలంలో పొలాలను లీజుకు తీసుకుని అక్కడ కూడా కరివేపాకు సాగు చేపట్టారు. రైలు మార్గంలో ముంబయి, చెన్నై నగరాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా...



ఆధిపత్య పోరుతో ఫ్యాక్షన్‌కు బీజం పడి గ్రామం రెండు వర్గాలుగా విడిపోయింది. ఫ్యాక్షన్ కారణంగా సర్వమూ కోల్పోయాను. పేదరికంతో కొట్టుమిట్టాడాను. పిల్లలను చదివించుకోలేక పోయా. ఆ సమయంలో గుంటూరు ప్రాంతంలోని వడ్లపూడికి చెందిన రైతులు మా గ్రామంలోని భూములను గుత్తకు తీసుకుని కరివేపాకు సాగు చేపట్టారు. దీంతో కరివేపాకు సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. అయితే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నా భార్యకు వివాహ సమయంలో పుట్టింటి వారు తాడిపత్రిలో ఇచ్చిన స్థలాన్ని అమ్మగా వచ్చిన డబ్బుతో గ్రామంలో ఐదు ఎకరాల పొలం కొనుగోలు చేసి, కరివేపాకు సాగు చేపట్టాను. లాభాలు రావడంతో ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించాను. ప్రస్తుతం నా కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కరివేపాకు పంట నా ఒక్కడి జీవితాన్నే కాదు గ్రామంలో అందరి జీవితాలను మార్చింది.

– సూర్యనారాయణ, యర్రగుంటపల్లి

బంగారం వ్యాపారికి బురిడీ

- నకిలీ గొలుసు ఇచ్చి రూ.1.40 లక్షలు చేజిక్కించుకున్న వైనం



వ్యాపారికి గొలుసు చూపుతున్న అపరిచితురాలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలోని నిజాముద్దీన్ జ్యువెలరీ నిర్వాహకులు దాదాఖలందర్, తాజుద్దీన్‌ను సోమవారం ఓ మహిళ బురిడీ కొట్టించి రూ1.40 లక్షల విలువ చేసే బంగారం, నగదు తీసుకెళ్లింది. వివరాలు.. నిజాముద్దీన్ జ్యువెలరీ దుకాణానికి సోమవారం ఉదయం ఓ మహిళ వెళ్లింది. పక్కనున్న వ్యక్తిని తన భర్తగా పరిచయం చేస్తూ తమది నెరిమెట్ల గ్రామం అని, కుమార్తె వివాహం పెట్టుకోవడంతో తన వద్ద ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసు తీసుకుని కొంత నగదు, జత కమ్మలు ఇవ్వాలని కోరుతూ గొలుసు తీసిచ్చింది. దానిని పరీక్షించిన అనంతరం మేలిమి బంగారమేనని నిర్ధారించుకున్న వ్యాపారి దాదాఖలందర్... ఆ గొలుసుకు రూ.50 వేల నగదుతో పాటు ఆరు గ్రాముల బరువున్న కమ్మలు వస్తాయని తెలిపాడు. తానిచ్చిన బంగారు గొలుసును సదరు మహిళ చేతికి తీసుకుని అమ్మాయి పెళ్లి కాబట్టి కాస్త చూసి ఇవ్వాలంటూ బేరం ఆడింది. పాత బంగారం కావడంతో ఆ ధర వస్తోందని వ్యాపారి చెప్పడంతో చివరకు సరేనంటూ బ్యాగ్ లో ఉంచిన గొలుసు తీసిచ్చి.. వ్యాపారి ఇచ్చిన రూ.50 వేల నగదు, జత కమ్మలు తీసుకుని వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఆ గొలుసును మరోసారి పరీక్షించగా అది నకిలీదని తేలింది. దీంతో మహిళ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. సీసీ టీవీ కెమెరా ఫుటేజీల్లో సదరు మహిళా అసలైన బంగారు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు మారుస్తున్న దృశ్యం స్పష్టంగా నిక్షిప్తమైంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వ్యాపారి తెలిపాడు.

తిరుగుతూనే ఉన్నామయ్యా

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 375 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ''అయ్యా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాము. మా సమస్యలు పరిష్కరించి ఆదుకోండి'' అంటూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునుడు, మల్లికార్జునరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 375 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కార క్రమంలో ఏస్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు.

- తన సోదరుని పేరిట ఉన్న భూమికి 1బీ, అడంగల్ రావడం లేదని బుక్కరాయసముద్రం మండల కేంద్రానికి చెందిన కృష్ణంరాజు విన్నవించాడు. సర్వే నంబరు 220–2లో తన తమ్ముడు శ్రీకాంత్ పేరున ఉన్న 4.18 ఎకరాల భూమికి 1బి, అడంగల్ రావడం లేదని చెప్పాడు. ఆన్‌లైన్‌లో చూసుకుంటే తహసీల్దారు డిజిటల్ సంతకం కాలేదని వస్తోందని, డిజిటల్ సంతకం చేయించి సమస్య పరిష్కరించాలని కోరాడు.



- ఈ దివ్యాంగురాలి పేరు దూదేకుల బావమ్మ. ఈమెది పెద్దవడుగూరు మండలం రాంపురం గ్రామం. బావమ్మకు నా అనేవారు ఎవరూలేరు. వేలిముద్రలు పడడం లేదంటూ చౌక దుకాణంలో రెండు నెలలుగా బియ్యం వేయడం లేదు. వేళ్లు లేవు వేలిముద్రలు ఎలా వేసేది అని చెప్పినా వినిపిచుకోలేదు. వీఆర్ఓ వద్దకు వెళితే దురుసుగా మాట్లాడుతున్నాడు. తాను ఏ పని చేసుకోలేనని, బియ్యం కూడా రాకపోతే ఎలా బతికేది అంటూ అధికారుల ఎదుట బావమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.



- ఈ దివ్యాంగుని పేరు బోయ రమేష్. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామం. ఇతనికి ఎడమ చేయి, ఎడమకాలు పనిచేయవు. గతంలో 'సదరం'లో తాత్కాలిక సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో పింఛను ఇవ్వలేదు. తరువాత స్లాట్ బుక్ చేసుకుని సదరం క్యాంపు ఏర్పాటు చేసిన ఉరవకొండ ఆస్పత్రికి వెళితే డబ్బు అడిగితే రమేష్ ఇవ్వలేదు. ఈ క్రమంలోనే పింఛన్ అర్హుడు కాదంటూ గతనెల 4న సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో అధికారులను కలిసి రమేష్ తన గోడు వెళ్లబోసుకున్నాడు.

కూటమి నిర్లక్ష్యంపై నేడు 'ఫ్యాప్టో' ధర్నా


- ఉమ్మడి జిల్లా నుంచి విజయవాడలో తరలివెళ్లిన ఉపాధ్యాయులు



విజయవాడ బయలుదేరుతున్న ఫ్యాప్టో అనంతపురం నగర కమిటీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ, ఆర్థిక సమస్యలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండకడుతూ ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు మంగళవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తరలివెళ్లారు. బస్సులు, రైళ్లు, నాలుగు చక్రాల వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. విజయవాడలో ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని నాయకులు వెల్లడించారు. ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం నమ్మించి వంచనకు గురి చేసిందని వాపోయారు. ఉన్న సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా విద్యారంగంలో కనీస సమస్యలు పరిష్కరించలేదన్నారు. నాలుగు డీఏలు బకాయిలున్నాయన్నారు. సరెండర్ లీవ్‌లు ఎన్‌క్యాష్‌మెంట్ చేయలేదన్నారు. ఐఆర్ ఇవ్వలేదని, పీఆర్సీ కమిషన్‌ను నియమించలేదని మండిపడ్డారు. మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపేందుకు ఉద్యమబాట తప్పనిసరిగా మారిందన్నారు. ఇప్పటికైనా దిగొచ్చి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ మెడలు వంచేందుకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైద్య విద్యను పేద, మధ్య తరగతి వారికి అందకుండా నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో 107, 108 జీఓలకు వ్యతిరేకంగా మాట్లాడిన లోకేష్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చి మొత్తం కాలేజీలనే బేరం పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రైవేట్‌కు ఉద్ధరించేందుకే పీపీపీ విధానం గొప్పదిగా కూటమి నేతలు ప్రచారం చేస్తున్నారన్నారు. చివరకు రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు సైతం నర్సీపట్నం కాలేజీ నిర్మాణానికి అనుమతులే లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అవాస్తవాలు, అబద్ధపు ప్రచారాలు ఆపి తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా కేవలం రూ. 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. వెంటనే మొత్తం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, సహాయ కార్యదర్శులు వెంకీ, భీమేష్, హారుణ్ రషీద్, శాంతిరాజ్, నగర నాయకులు సాయి, మహేష్, పరమేష్ పాల్గొన్నారు.

నోటి మాటే శాసనం

- అధికారికంగా ఎలాంటి ఉత్తర్వూ లేకపోయినా శిక్షణకు అనుమతి
- మెరిట్ అభ్యర్థి వ్యవహారంలో విద్యాశాఖ అధికారుల తీరు



కొత్త టీచర్లకు ఇస్తున్న శిక్షణ కేంద్రం వద్ద మెరిట్ అభ్యర్థి ఆంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25 ఇంగ్లిష్ సబ్జెక్టులో మెరిట్ అభ్యర్థి జీవితంతో అధికారులు ఆడుకుంటున్నారు. అతని కంటే వెనకున్న 8 మంది అభ్యర్థులకు అవకాశం ఇచ్చిన అధికారులు.. ప్రస్తుతం స్వీయ రక్షణలో పడ్డారు. తమ నోటిమాటే శాసనమని నమ్మబలికి విజయవాడలో ఆర్డర్ కాపీ ఇప్పిస్తామంటూ పిలుచుకెళ్లి రిక్త హస్తాలతో వెనక్కు పిలుచుకొచ్చారు. చివరకు ఇండక్షన్ శిక్షణకు హాజరయ్యేలా చేశారు కానీ, పోస్టుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు.

ఏమి జరిగిందంటే...

స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ మెరిట్ జాబితాలో 48వ ర్యాంకులో ఉన్న ఎ.ఆంజనేయులు పేరును వెరిఫికేషన్ రోజు ఒరిజినల్ సర్టిఫికెట్లు లేని కారణంగా ఫ్రీజింగ్ జాబితాలో ఉంచారు. గడువులోపు సర్టిఫికెట్లు అందజేయడంతో ఆయన పేరును అర్హుల జాబితాలో చేర్చి రాష్ట్ర అధికారులకు పంపారు. అయితే తుది జాబితాలో మాత్రం ఆంజనేయులు పేరు కనిపించలేదు. బీసీ–ఏ కేటగిరీలో అతని కంటే తక్కువ ర్యాంకులు సాధించిన 8 మందికి పోస్టులు దక్కాయి. ఇదే అంశంపై పత్రికల్లో కథనాలు వెలువడడంతో అధికారులు స్వీయ రక్షణలో పడ్డారు. దీంతో గత నెల 23న సాయంత్రం 7.30 గంటలకు ఏపీఓ మంజునాథ్ ఫోన్ చేసి విజయవాడకు బయలుదేరాలని, అక్కడే ఆర్డర్ కాపీ ఇస్తారని చెప్పడంతో అదే నెల 24న ఉదయం అందరితో పాటు ఆంజనేయులు విజయవాడ వెళ్లారు. అయితే అక్కడికెళ్లిన తర్వాత ఆంజనేయులుకు ఎలాంటి కిట్టు ఇవ్వకుండానే వెనక్కు పిలుచుకు వచ్చారు.

శిక్షణలోనూ అటెండెన్స్ లేదు

ఈ నెల 3 నుంచి కొత్త టీచర్లకు ఇండక్షన్ శిక్షణ ప్రారంభమైంది. దీంతో 2న డీఈఓ కార్యాలయానికి ఫోన్ చేసి తన పరిస్థితి ఏమిటో చెప్పాలని ఆంజనేయులు అడిగాడు. శిక్షణ కేంద్రానికి హాజరుకావాలని, శిక్షణ ముగిసిన తర్వాత ఉత్తర్వులు అందజేస్తారని తెలిపారు. దీంతో అనంతపురం రూరల్ పంగల్‌రోడ్డు సమీపంలోని వివేకానంద జూనియర్ కళాశాల కేంద్రానికి వెళితే.. శిక్షణకు అలాట్ చేసిన అభ్యర్థుల జాబితాలో ఆంజనేయులు పేరు లేదు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే... అందరూ ఆన్‌లైన్ (లీప్‌యాప్) అటెండెన్స్ వేస్తున్నారని, జాబితాలో పేరు లేదు కాబట్టి ఆన్‌లైన్ అటెండెన్స్ వేసేందుకు వీలుండదని తేల్చి చెప్పారు. శిక్షణకు హాజరైనా ఎలాంటి ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని జిల్లా పరిశీలకులు, జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు దృష్టికి ఆంజనేయులు తీసుకెళ్లారు. దీంతో డీఈఓ కల్పించుకుని ఈ విషయాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

ఇబ్బంది ఉండదు

ఆంజనేయులు సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆయనకు కచ్చితంగా న్యాయం జరుగుతుంది. సాంకేతిక సమస్య కారణంగా కాస్తా ఆలస్యమై ఉండొచ్చు. వీలైనంత త్వరగా ఆయన సమస్యకు పరిష్కారం చూపుతాం.

– ఎం.ప్రసాద్‌బాబు, డీఈఓ

బావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



ట్రాక్టర్‌తో పాటు బావిలో పడిన రైతును వెలికి తీస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ట్రాక్టర్ అదుపు తప్పి నేరుగా వెళ్లి బావిలో పడింది. వివరాలు.. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం ట్రాక్టర్‌తో తన పొలంలో సేద్యం చేస్తుండగా అదుపు తప్పి నీళ్లు లేని బావిలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ట్రాక్టర్‌తో పాటు బావిలో పడిన రామచంద్రారెడ్డిని వెలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో మంచానికి తాళ్లు కట్టి బావిలో దించారు. అనంతరం దానిపై రామచంద్రారెడ్డిని చేర్చి పైకి లాగారు. తీవ్ర గాయాలైన రామచంద్రారెడ్డిని 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



లక్ష్మీనారాయణ నాయక్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అవమాన భారం తాళలేక హంద్రీ–నీవా కాలువలో దూకి గల్లంతైన ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన లక్ష్మీనారాయణ నాయక్ (45) మూడు రోజుల తర్వాత మృతదేహమై తేలాడు. వివరాలు.. తనను ఇంటి పక్కన ఉన్న మహిళ చెప్పుతో కొట్టడంతో గ్రామంలో పరువు పోయిందంటూ మనో వేదనకు లోనైన లక్ష్మీనారాయణ నాయక్ శనివారం సాయంత్రం హంద్రీ–నీవా కాలువలో దూకిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు, స్థానికులు ముమ్మర గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం ఆత్మకూరు మండలం గొరిదిండ్ల సమీపంలో కాలువలో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పిటీషన్లు పునరావృతం కాకూడదు : ఎస్పీ

అనంతపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక్కసారి ఇచ్చిన పిటీషన్లు పునరావృతం కాకూడదని సిబ్బందిని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి నుంచి ఆయన వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకున్నారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

140 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



జల్లిపల్లి వద్ద పోలీసులకు పట్టుబడిన బియ్యం వాహనం

కూడేరు: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్ఐ జమాల్‌బాషా, సీఎస్‌డీటీ శాంతకుమారి కూడేరు మండలం జల్లిపల్లి వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 140 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. అనంతపురంలోని తపోవనంలో నివాసముంటున్న బాబా ఫకృద్దీన్ తన బొలెరో వాహనంలో వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి నుంచి 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అనంతపురం మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

ఉరవకొండ: స్థానిక స్పైస్ ఇన్ రైస్ రెస్టారెంట్ సమీపంలో అక్రమంగా డంప్ చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం ఉదయం తహసీల్దార్ మహబూబ్‌బాషా, సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వలు ఎవరో చేశారో విచారణ చేస్తున్నట్లు సీఐ మహనంది తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధుడి మృతి

తాడిపత్రి టౌన్: స్థానిక గురు లాడ్జి సమీపంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పట్టణానికి చెందిన వడ్డే వెంకటేష్ (75) మృతి చెందాడు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో మద్యం మత్తులో తన ఇంటి సమీపంలోని చెత్త వద్ద వడ్డే వెంకటేష్ పడిపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ అంటించుకుని అగ్గిపుల్ల ఆర్పకుండా పడేయడంతో చెత్తకు నిప్పు అంటుకుంది. ఎవరూ గమనించకపోవడంతో మంటలు చెలరేగి వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న జ్ఞానవేదిక సభ్యులు

అనంతపురం కల్చరల్: ఇంద్రియాలను జయించడమే దసరా పర్వదిన వేడుకల వెనుక ఉన్న అంతరార్థమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం జీసెస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకులు మాట్లాడారు. దసరా పర్వదినాల ప్రాముఖ్యతను త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాల్లో వివరించిన తీరుపై ప్రచారం గావించారు. యోగ మార్గం ద్వారా దుర్గుణాలను నశింపజేసుకున్నప్పుడే జ్ఞానరేఖలు ప్రసరిస్తాయని, గురువుల విశిష్టతను తెలుసుకుని ప్రతి పర్వదినంలో వారిని స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిర, నాగిరెడ్డి, నల్లప్ప, నాగేశ్వరి, రామకృష్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సాయిదత్త' సిల్వర్‌జూబ్లీ



మాట్లాడుతున్న శ్రీపాద వేణు

అనంతపురం కల్చరల్: శ్రీసాయి దత్త మ్యాక్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నగరంలోని శ్రీసాయి దత్త సొసైటీ కార్యాలయం వేదికగా సాయిబాబా కళాశాల ప్రిన్సిపాల్ పీఎల్ఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాతికేళ్ల ప్రస్థానం గురించి పలువురు వక్తలు మాట్లాడారు. టీటీడీ ధర్మప్రచార మండలి ప్రతినిధి శ్రీపాద వేణు, చార్టెడ్ అకౌంటెంట్ కుంటిజి శ్రీధర్, సాయిబాబా కళాశాల ప్రెసిడెంట్ రమణారెడ్డి, సీఈఓ రమానందనరెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. పేద, మధ్య తరగతి వారి మన్నన పొంది తక్కువ శాతం వడ్డీలకే సొసైటీ నడుస్తుండడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలలో కూడా భాగస్వాములు కావాలని తీర్మానించినట్లు వెల్లడించారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు.

ప్రతి ఉద్యోగీ సభ్యత్వం తీసుకోవాలి



సభ్యత్వాలు తీసుకున్న రసీదులను చూపుతున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ఏపీ ఎన్‌జీఓ సభ్యత్వాన్ని ప్రతి ఉద్యోగీ తీసుకోవాలని ఏపీ ఎన్‌జీఓ నగర కార్యదర్శి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యోగ రీత్యా ఏమైనా సమస్యలు ఎదురైతే ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ పోరాడుతుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 30 మంది ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివ కృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జయంతిని జయప్రదం చేయండి



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రమైన రాప్తాడులో మంగళవారం నిర్వహించే వాల్మీకి మహర్షి జయంతిని జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, ఎస్‌జేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సాకే జయరాముడు పిలుపునిచ్చారు. సోమవారం వారు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంగళవారం ఉదయం 9 గంటలకు వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం, సాయంత్రం 5.30 గంటలకు వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. మండలంలోని బోయ కులస్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు తలారి శివ, జయన్న, రామకృష్ణ, నాగప్ప, రామకృష్ణ, ట్రాక్టర్ కుల్లాయప్ప, జూటూరు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో కార్తి వేలు తెగిపోయిన దృశ్యం

ఈమె పేరు కార్తి. అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తోంది. అరవిందనగర్‌లో నివాసముంటున్న ఈమె సోమవారం ఇంటి నుంచి హోటల్‌కు బయలుదేరింది. ఉన్నట్టుండి ఓ కుక్క దాడి చేసింది. ఎడమ చేతి మధ్య వేలిలోని సగ భాగాన్ని కొరికేసింది. అక్కడే ఉన్న భర్త లక్ష్మోజీ రావు పరుగున వచ్చి అరవడంతో కుక్క పరుగులు తీసింది. తర్వాత ఆమెను సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. సీరియస్‌గా ఉండడంతో వైద్యులు ఫీమేల్ సర్జికల్ వార్డులో అడ్మిట్ చేశారు.

- ఇటీవల నగరంలోని అశోక్‌నగర్‌లో రాము అనే బాలుడు స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. రాము చేతికి గాయమైంది. చుట్టుపక్కల వారు వేగంగా స్పందించి కుక్కలను తరిమేయడంతో ఆ బాలుడికి పెద్ద ప్రమాదం తప్పింది. ఇటువంటి ఘటనలు నగరంలో రోజు రోజుకూ అధికమవుతున్నాయి. కుక్కల బెడదతో మనుషుల ప్రాణాల మీదకు వస్తున్నా అటు పాలకులు కానీ..ఇటు జిల్లా అధికార యంత్రాంగం కానీ స్పందించడం లేదు.



శునకాల దండయాత్ర

- కుక్కల దాడిలో ఆస్పత్రుల పాలవుతున్న నగరవాసులు
- అరవిందనగర్‌లో ఓ మహిళ వేలిని కొరికేసిన శునకం
- చేష్టలుడిగి చూస్తున్న పాలకులు, అధికారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో పాలకుల బాధ్యతారాహిత్యానికి నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్నికలకు ముందు ప్రజలకు అది చేస్తాం..ఇది చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఇప్పుడు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్దపెద్ద సమస్యలను పక్కనబెడితే కనీసం చిన్న సమస్యలను సైతం పరిష్కరించలేని స్థితిలో ఉన్నారు. ఇందుకు కుక్కల బెడద నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజలను భయభ్రాంతులకు



నగరంలో సంచరిస్తున్న కుక్కలు

గురిచేస్తున్న కుక్కలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటివరకు కనీసం ఒక్క సమావేశం కూడా నిర్వహించిన పాపానపోలేదు.

స్టెరిలైజేషన్ ఏదీ?

కుక్కలను నియంత్రించేందుకు స్టెరిలైజేషన్ ప్రక్రియ చేపట్టడం లేదు. నగర పాలక సంస్థ అధికారులు అదిగో..ఇదిగో అంటున్నారు తప్పా ఏనాడూ నిర్దేశిత సమయంలో ప్రక్రియ చేపట్టేందుకు ముందుకు రాలేదు. నగర పాలక సంస్థకు ప్రజలు పన్నుల ద్వారా రూ.కోట్లు చెల్లిస్తున్నా..వారి భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కుక్కల స్టెరిలైజేషన్‌కు హర్యానాకు చెందిన స్నేహ్ అనిమల్ వెల్ఫేర్ సొసైటీతో గత నెల 20న నగర పాలక సంస్థ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. స్టెరిలైజేషన్‌కు గాను ఒక్కో కుక్కపై రూ.1,500 చెల్లించేలా ఒప్పందం జరిగింది. సదరు ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ ఇచ్చినా ఇంత వరకు పనులు మొదలుకాలేదు. త్వరగా ప్రక్రియ చేపట్టేలా ఏజెన్సీపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం లేదు.

నాలుగు వేల మంది బాధితులు!

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు నాలుగు వేల మంది కుక్కకాటు బాధితులు నమోదైనట్లు తెలుస్తోంది. వీరందరూ సర్వజనాస్పత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకున్నారు. అనంతపురం అర్బన్‌లోని 50 డివిజన్లతో పాటు రూరల్, శింగనమల, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ ప్రాంతాల నుంచి బాధితులంతా చికిత్స కోసం సర్వజనాస్పత్రికి వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే భవిష్యత్తులో కుక్కకాటు బాధితుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముంది.

సమస్యలు పరిష్కరించాలి



రెవెన్యూభవన్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ లెప్రసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం పెద్ద రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమతో పాటు పిల్లల జీవనాధారానికి ప్రభుత్వం 1972లో కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద 67.70 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటూ, లెప్రసీ కాలనీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే తమ భూమికి పక్కనున్న పొలాల వారు ప్లాట్లు వేస్తూ ఆక్రమిస్తున్నారన్నారు. భూమిని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేయించాలన్నారు. సారంబి అనే మహిళకు వేలిముద్రలు పడకపోవడంతో వీఆర్ఓ వేలిముద్ర వేసి రేషన్ ఇచ్చేవారన్నారు. ఇప్పుడు ఆమె ఆధార్‌కు వీఆర్ఓ ఆధార్ లింక్ కావడంతో ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తూ ఏ పథకం అందడం లేదన్నారు. వేలిముద్రలు పడలేదంటూ ఐదుగురికి అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కాలేదన్నారు. వేలిముద్రలు పడలేదనే కారణంగా లెప్రసీ కాలనీలోని మూర్తి అనే వ్యక్తికి ఆయన కుటుంబంలోని ముగ్గురు సభ్యులకు ఆధార్ రాలేదన్నారు. సమస్యలను పరిష్కరించాలంటూ డీఆర్ఓ మలోలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, సుబ్బరాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన ఎస్పీ జగదీష్

అనంతపురం: పదవీ విరమణ అనివార్యమైనా డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లోక్‌నాథ్ చౌదరి, ట్రాఫిక్ ఎస్ఐ విజయ భాస్కర్ రాజు, అనంతపురం రూరల్ మహిళా ఏఎస్ఐ వరలక్ష్మి పదవీ విరమణ పొందారు. సోమవారం ఈ ముగ్గురిని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రవిరాంనాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

9న దిశ కమిటీ సమావేశం

అనంతపురం సిటీ: జిల్లా దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో ఉదయం 11 గంటలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. మంత్రులు, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, దిశ కమిటీ సభ్యులు హాజరు కానున్నారు.

ఎస్ఎస్ఏలో అవినీతిపై విచారణ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అర్హత లేని వారికి అక్రమంగా సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియన్ ఉద్యోగాలు ఇవ్వడంపై విచారణ చేయాలంటూ దళిత, గిరిజన సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏఎంఓగా నియామకం పొందిన వేణుగోపాల్ ఎస్ఎస్ఏ ఏపీసీ కుటుంబానికి అత్యంత దగ్గరి వ్యక్తన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసిన చంద్రశేఖర్‌ను ఏసీఎంఓ, కె.నారాయణస్వామిని ఏఏఎంఓగా నియమించారన్నారు. వీరిద్దరూ ఎస్ఎస్ఏ ఏపీసీ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మినిస్టీరియల్ ఉద్యోగుల పట్ల వివక్ష చూపిస్తూ వారిని సరెండర్ చేశారన్నారు. వెనుకబడిన వర్గాలకు సర్వశిక్ష అభియాన్‌లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నోటిఫికేషన్ రద్దు చేసి అక్రమ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్ఓ మలోలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన సంఘాల నాయకులు నెరమెట్ల ఎల్లన్న, కేపీ నారాయణస్వామి, చిన్న ఆంజనేయులు, నగేష్, ఓబుళపతి, చంద్ర, శ్రీనివాసులు, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అవార్డులను అందిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి తమ ఆరోగ్యాలను సైతం ఫణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 54 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డులు అందజేశారు.

మార్మోగిన శివనామస్మరణ



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమం సోమవారం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి శివపార్వతులకు ఏకవార రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, అలంకార సేవలు భక్తిశ్రద్ధలతో సాగాయి. అనంతరం లోకకల్యాణార్థం అనంతేశ్వరి, అనంతేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు సంప్రదాయబద్ధంగా జరిపించారు. వైభవోపేతంగా సాగిన శివపార్వతుల కల్యాణంలో మహిళలు భక్తి గీతాలను అద్భుతంగా ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం అన్నప్రసాద వినియోగం జరిగింది. మంగళవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి, వైద్య సిబ్బంది

రాప్తాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆవరణలో నూతనంగా నిర్మించిన మందిరంలో వినాయక విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. వైద్యాధికారి శివ కృష్ణ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వేదపండితులు వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, జ్వాలా దర్శనం, గోదర్శనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి, డీఐఓ యుగంధర్, డీపీఎంఓ శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మీ విచ్చేసి పూజలు చేశారు. అనంతరం పీహెచ్‌సీలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్ బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో మండలస్థాయి స్కూల్ గేమ్స్

రాప్తాడు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఈనెల 9, 10వ తేదీల్లో రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కన్వీనర్, ఎంఈఓ మల్లికార్జున, మండల కోఆర్డినేటర్, పీడీ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్-14, అండర్- 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 9వ తేదీన రాప్తాడు జెడ్పీ హైస్కూల్ మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, 10వ తేదీన ఎల్ఆర్‌జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు.

తగ్గేదే లేదంటున్న 'తమ్ముళ్లు'

- చియ్యేడు ఉలిసికొండలో యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు



చియ్యేడు ఉలిసికొండ వద్ద హిటాచీతో మట్టి తవ్వుతున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల పేర్లు చెప్పుకుంటూ సాగుతున్న మట్టి దందాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రభుత్వానికి పైసా రాయల్టీ చెల్లించకుండానే మట్టి దందా చేస్తున్నా.. అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఇదివరకే ఆలమూరు ఎర్రకొండ, నరసనాయనికుంట ఆంజనేయస్వామి ధ్వజస్తంభం గుట్ట, కృష్ణమరెడ్డిపల్లి సమీపంలోని పెద్దకొండ, పూలకుంట సమీపంలో గుట్టను చెరబట్టి రూ.కోట్లు కూడబెట్టుకున్న 'తమ్ముళ్లు'.. తాజాగా చియ్యేడు ఉలిసికొండపై పడ్డారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యుల పేర్లు చెప్పుకుంటూ కృష్ణంరెడ్డిపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడి నుంచి మట్టి రవాణా చేస్తున్నాడు. ఈయనకే జేసీబీ, టిప్పర్లు ఉన్నాయి. 15 రోజుల నుంచి రోజూ 40 టిప్పర్ల దాకా మట్టి లోడింగ్ జరుగుతోంది. బయటి నుంచి వచ్చే టిప్పర్లకు కూడా మట్టి నింపుతూ ఒక్కో దానిపై రూ.3 వేల దాకా తీసుకుంటున్నారు. అక్రమ సంపాదనలో అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడు, క్లస్టర్‌కు చెందిన మరో నాయకుడికి వాటాలు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. చియ్యేడు ఉలిసికొండ నుంచి ఎర్రమట్టి వాహనాలు ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ మీదుగానే.. అది కూడా పట్టపగలే అనంతపురం వైపు వెళ్తున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు.

పరిటాల అండతోనే దోపిడీ

పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత సహజ వనరుల దోపిడీ తారాస్థాయికి చేరింది. కొండలు, గుట్టలన్నీ లూటీ చేస్తున్నారు. రూరల్ మండలంలోనే ఇప్పటిదాకా రూ.80 కోట్లకు పైగా విలువైన మట్టి దందా సాగి ఉంటుంది. అక్రమార్కులకు పరిటాల కుటుంబం అండగా ఉండడంతో అధికారులు ధైర్యంగా చర్యలు తీసుకోలేకపోతున్నారు.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సీజేఐపై దాడి హేయం

- ప్రజా సంఘాల నాయకుల మండిపాటు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై మతోన్మాదుల దాడి హేయమైన చర్య అని సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఐలు, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సంఘాల నాయకులు నాగేంద్రకుమార్, సతీష్, ప్రసన్నకుమార్, చంద్రిక, పరమేష్ తదితరులు మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో జస్టిస్ గవాయ్‌పై కోర్టులో అందరూ చూస్తుండగా మతోన్మాద అడ్వకేట్ రాకేష్ కిషోర్ చెప్పు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. మోదీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తూ వస్తున్నారని మండిపడ్డారు. ఇదే సనాతన ధర్మం అని ప్రధానమంత్రి భావిస్తున్నారా అనేదానిపై జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్ ఈ చర్యను సమర్థిస్తారా లేక వ్యతిరేకిస్తారా అనేదానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరుయాదవ్, ప్రకాష్, హుసేన్, నాగమణి, గోపాల్, రామాంజినేయులు, శ్యామల, అశ్విని, గిరి, భీమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

రాప్తాడు: మండల కేంద్రమైన రాప్తాడు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 300లో చెరువు వద్దకు వెళ్లే రస్తాకు అడ్డంగా నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని పలువురు రైతులు తహసీల్దార్ విజయకుమారిని కోరారు. సోమవారం ఈ మేరకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... దారికి అడ్డంగా విద్యుత్ స్తంభాలను నాటడం వల్ల 300 ఎకరాలకు వెళ్లే దారి లేకుండా పోతోందన్నారు. ఈ దారి వెంట రైతులు దశాబ్దాలుగా రాకపోకలు సాగిస్తున్నారని, ఈ మేరకు రెవెన్యూ స్కెచ్‌లో కూడా రస్తా ఉందన్నారు. రస్తాపై అడ్డంగా నాటిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్...పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హోంగార్డు కుటుంబాలకు చేయూత

అనంతపురం: ఇటీవల మృతి చెందిన ముగ్గురు హోంగార్డు కుటుంబాలకు, పదవీ విరమణ పొందిన మరో ఇద్దరు హోంగార్డులకు మొత్తం రూ.11.26 లక్షల చెక్కును ఎస్పీ పి. జగదీష్ అందజేశారు. ఒక రోజు వేతనాన్ని హోంగార్డులు ప్రకటించారు. ఈ ఏడాది జూన్ 5న అనారోగ్యంతో లక్ష్మి రెడ్డి మృతి చెందగా.. ఆయన భార్య కళావతికి రూ.19,880, జూన్ 13న మృతి చెందిన నరసింహులు భార్య వరలక్ష్మికి రూ.5.11 లక్షలు, జూన్ 2న మృతి చెందిన తిరుపాల్ నాయక్ భార్య శాంతమ్మకు రూ.31,800, ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ పొందిన నూర్ మహమ్మద్‌కు రూ.5.09 లక్షలు, మేలో రిటైర్డ్ అయిన కృష్ణవేణికి రూ.53,400 విలువ చేసే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.